క్లుప్తంగా

ఓంకారేశ్వరుడికి ఆరుద్రోత్సవం



పూజలందుకున్న ఓంకార సిద్ధేశ్వరస్వామి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారం క్షేత్రంలో కొలువైన శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామికి ఆదివారం, ఆషాఢమాసం, మాసశివరాత్రి పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకులు చక్రపాణిశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన పూజలు చేపట్టారు. ప్రదోష కాలంలో స్వామివారికి అలంకరణ చేసి విశేష ద్రవ్యాలతో పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకున్నారు.

శాకాంబరి అలంకరణలో అమ్మవారు



వెలుగోడు: ఆషాఢ మాసం చివరి రోజు సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాతను శాకాంబరి అలంకరణలో అలంకరించారు. మహిళలు ఒక్కొక్కరు 9 రకాల స్వీట్లు, చీర, సారెతో పొట్టి శ్రీరాములు సెంటర్‌కు చేరుకొని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్లారు. పురోహితులు నరసరామ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు లలితా సహస్రపారాయణం చదివి వినిపించారు. అనంతరం అమ్మవారికి మహిళలు చీర, సారె సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు లాలం సుధాకర్, నాగపుల్లయ్య, లక్ష్మీ నారాయణ, నాగేశ్వరరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు ఎరువులు సిద్ధం



ఎరువు బస్తాలను రైతు భరోసా కేంద్రానికి తరలిస్తున్న దృశ్యం

నందికొట్కూరు రూరల్ : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మల్యాల రైతు భరోసా కేంద్రంలో ఎరువులను సిద్ధంగా ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి షేక్షావలి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని మల్యాల రైతుభరోసా కేంద్రానికి 200 డీఏపీ, 150 యూరియా, 20.20.0.13 రకానికి చెందిన 200 ఎరువు బస్తాలు వచ్చాయని చెప్పారు. ఎరువులు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డులను వ్యవసాయాధికారులకు అందించి, పేరు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లనాయుడు, శ్రీనివాసులు, రవి పాల్గొన్నారు.

అంబేడ్కరా మన్నించు!



మురుగు కాల్వ వద్ద అంబేడ్కర్ విగ్రహం

పాములపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటే దేశంలో తెలియని వారుండరు. ఆయన పేరు చెప్పగానే ఆరాధించే వారు కోకొల్లలు. అయితే మండలంలోని మిట్టకందాల గ్రామంలో దాదాపు 8 సంవత్సరాలుగా ఎవరికీ పట్టనట్లుగా నిత్యం మురుగు నిల్వ ఉండే ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఉంచి, ఆయనను అవమానిస్తున్నారని అభిమానులు వాపోతున్నారు. మండలంలోని వాడాల, మద్దూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన కూడలిలో ఈ విగ్రహం ఉంది.

ఇస్కాలలో పారిశుద్ధ్య పనులు



కాలువల్లో మురుగు తొలగిస్తున్న దృశ్యం

పాములపాడు:మండలంలోని ఇస్కాల గ్రామంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో సంవత్సరాల తరబడి కాలువల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మురుగు కాలువల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్పంచు మౌలాలి స్పందించి పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టి మురుగు కాలువలను శుభ్రం చేయించారు.

ప్రాకార కుడ్యం..శిల్ప కళాశోభితం

- 2,79,300 చదరపు అడుగుల వైశాల్యంలో శ్రీశైల ఆలయ ప్రాకారకుడ్యం
- చారిత్రక వైభవానికి సజీవ సాక్ష్యం
- భారతీయ శిల్పకళా చాతుర్యానికి తార్కాణం



శ్రీశైల ఆలయ ప్రాకార కుడ్యం

శ్రీశైలంటెంపుల్: వైభవోపేతమైన శతాబ్దాల చరిత్రను సొంతం చేసుకున్న శ్రీశైల మహాక్షేత్రం ఎన్నో చారిత్రక విశేషాలను పెనవేసుకుని, భక్తి, ఆధ్యాత్మిక భావాలతో పాటు వారసత్వ సంపదను కూడా అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్ తొలి పాలకులైన శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, విష్ణుకుండికులు, కదంబులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగరం చక్రవర్తులు, ఛత్రపతి శివాజీ తదితరుల పాలనా కాలంలో శ్రీశైలక్షేత్రం అంచలంచెలుగా అభివృద్ధి చెందింది. ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకున్న ఈ క్షేత్రంలో ఆలయ ప్రాకార కుడ్యం ఎంతో విశిష్టమైన కట్టడం.

ప్రతి రాయిపై శిల్పాలు

దాదాపు 2,79,300 చదరపు అడుగుల వైశ్యాలము, ఆలయ ప్రాంగాణం చుట్టు సుమారు 20అడుగుల ఎత్తు, 2121 అడుగుల పోడవుగల కోటగోడ వంటి నిర్మాణమే ఈ ప్రాకారకుడ్యం. 3,153 రాళ్లను ఉపయోగించి నిర్మించిన దీనిపై ఇంచుమించుగా బయటివైపు గల అన్ని రాళ్లపై శిల్పాలు చెక్కబడ్డాయి. ప్రాచీన రాయి కూడా ఒక గొప్ప కళాఖండమే. ఇలాంటి ప్రాకారాన్ని మనం హంపిలోని హజారా రామస్వామి ఆలయములో చూడవచ్చు.

ప్రాకార నిర్మాణం

విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు తన అధికారాన్ని ఏర్పరచుకోవడానికి ముందు శాంతలింగం శ్లు అనే సామంత ప్రభువు శ్రీశైలాన్ని పాలించేవాడని చరిత్ర చెబుతుంది. ఈ శాంతలింగంక్లే శ్రీశైలంలో ప్రాకారాలను నిర్మింపజేశాడు. ఈ ప్రాకార శిల్పాలను చెక్కిన శిల్పి పేరు కోండేజు. ఇతడు ఆత్మకూరు సమీపంలోని నందికుంట గ్రామంలో నివసించేవాడు. ఈ ప్రాకారం విజయనగరం రాజుల కాలములో శాంతిలింగళ్ళ ఆధ్వర్యంలో కోండేజు అనే ప్రాంతీయ శిల్పి చేత చెక్కబడిందని చెప్పవచ్చు.

ప్రాకార శిల్పాలు.. విభజన

శ్రీశైల ప్రాకారంలోని మొత్తం శిల్పాలలో దేవతలకు, పురాణ కథలకు, మతాచారాలకు సంబంధించిన శిల్పాలను మతశిల్పములని, ఆడవులు, జంతువులు, పక్షులు మొదలైన వాటిని ప్రకృతి శాల్పములని, మానవ జీవితములో వివిధ అంశములైన వేట, తిరునాళ్లు, దండయాత్రలు మొదలైనవాటిని సామాజిక శిల్పములని, తోరణాలు, అలంకారిక చిహ్నాలు, చతురస్ర, దీర్ఘచతురస్ర నమునాలు మొదలైన వాటిని అలంకారిక శిల్పాలని చరిలు విభజించారు.

అన్ని రకాల శిల్పములు

మత శిల్పముల ప్రాకారంగా శ్రీశైల ఆదిదేవుడైన శ్రీమల్లికార్జునస్వామి అవిర్భావాన్ని గురించి, శివుని తత్వాన్ని, శివుని గొప్పతనాన్ని, అమ్మవారి గొప్పతనాన్ని, శైవ, శాస్త్రీయ మత ప్రాభావాన్ని తెలియజేస్తున్నాయి. ప్రకృతి శిల్పాలలో ప్రాకారానికి నాలుగు వైపులా కింది భాగములో రెండు వరుసలలో ఉన్న ఏనుగులు, గుర్రాల శిల్పాలు ముఖ్యమైనవి. ప్రాకారకుడ్యంలో సామాజిక శిల్పాలు ఆనాడు సమాజం యొక్క ఆధ్యాత్మిక, వ్యక్తిత్వం, దేహభావాలు, విలాసాలు, యుద్ధరీతులు, వేటదృశ్యాలు, దేవుని ఊరేగింపులు, సంగీతంతో కూడిన నృత్యాలు, జానపద నృత్యరీతులు మొదలైన వాటిని సూచిస్తున్నాయి. ఇతిహాస, పౌరాణిక వృత్తాంతాలు, జానపద జీవన చిత్రీకరణ శిల్పాలు అలంకారిక శిల్పాలను గమనించవచ్చు. ఈ అలంకారిక శిల్పాలలో అలంకార వైవిధ్యాలు ఎంతో స్పష్టంగా కనిపిస్తాయి.

దేశంలోనే అత్యంత విశిష్టమైన ప్రాకార కుడ్యం



శ్రీశైల ఆలయ ప్రాకార కుడ్యం దేశంలోనే ప్రశిష్టమైనది. ఇలాంటి ప్రాకారాన్ని మనం హంపిలోని హజారా రామస్వామి ఆలయములో చూడవచ్చు. శ్రీశైల యాత్రకు విచ్చేసిన భక్తులు శ్రీశైల ఆలయ ప్రాకారకుడ్యాన్ని సందర్శించి పరవశించిపోతున్నారు. కుడ్యాన్ని అత్యంత పవిత్రంగా భావించి పర్యవేక్షణ చేపడుతున్నాం. దీని విశిష్టతను భక్తులందరికి తెలియజేసేలా తగు చర్యలు తీసుకుంటాం.

– ఎస్.లవన్న, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

రెడ్ జోన్లలో సేవలు



కరోనా సమయంలో వీధిలో తిరుగుతూ ప్రజల చేతులకు శానిటైజర్ వేస్తున్న గ్రామ వలంటీర్

కొత్తపల్లి: మండల పరిధిలోని దుద్యాల గ్రామానికి చెందిన వలంటీర్ జాకీర్ బాషా కరోనా విపత్తులో కష్టపడి సేవలను అందించాడు. రెడ్ జోన్లలో కరోనా సోకిన వారికి అవసరమైన సహకారాలు అందించాడు. పాజిటివ్ కేసులు నమోదైన వీధుల్లోకి వెళ్లి బ్లీచింగ్ చల్లడం, కరోనా సోకకుండా వీధులవెంట రసాయనాలు పిచికారి చేయించడం, ఏ ఒక్కరు ఇంటి నుంచి బయట రాకుండా నియంత్రిచగలిగాడు. పాజిటివ్ వ్యక్తుల ఇళ్ల వద్దకే మందులు అందజేసి, వైద్య సిబ్బందితో సూచనలు, సలహాలు ఇప్పించేవాడు. వారికి ఇంటివద్దకు కురగాయాలు, నిత్యావసర సరుకులు అందించేవాడు.

కుటుంబ సభ్యుడి కంటే ఎక్కువగా



కరోనా తాండవం చేస్తున్న సమయంలో మేము ఇంటిని వదిలి బయటికి వెళ్లలేని పరిస్థితి. మా క్లస్టర్ గ్రామ వలంటీర్ జాకీర్ బాషా ఇంటి నుంచి ఎవరూ బయటికి రావద్దని, ఏమైన అవసరాలు ఉంటే నాకు ఫోన్ చేయండి అని చెప్పి, అవసరమైనవి వెంటనే తెచ్చి ఇచ్చేవాడు. ప్రతిరోజు వచ్చి మాతో మాట్లాడి ఏఏ ఆరోగ్య సమస్యలు ఉన్నాయో తెలుసుకొని మందులు తెచ్చి, ఎలా వాడాలో తెలియజేసేవాడు. కరోనా సమయంలో అధికారులను తీసుకువచ్చి కరోనా టెస్టులు చేయించే వాడు. – గోకవరం నూర్ అహమ్మద్, దుద్యాల, కొత్తపల్లి మండలం

కరోనా సమయంలో కర్నూలు ఆసుపత్రికెళ్లి



ప్రభుత్వ వైద్యశాలలో అస్వస్థతకు గురైన సాలమ్మకు ఫించన్ అందజేస్తున్న వలంటీర్ మహేష్

ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామానికి చెందిన వలంటీర్ మహేష్ తన విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నాడు. కరోనా విజృంభిస్తున్న సమయంలోనూ ధైర్యంగా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేసి అవ్వాతాతల దీవెనలు పొందాడు. ఆ సమయంలో తన పరిధిలోని సాలమ్మ అనే వృద్ధురాలు అస్వస్థతకు గురై కర్నూలు ఆసుపత్రిలో చేరింది. ఆమెకు డబ్బు అవసరమని తెలుసుకొని బైక్‌పై కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేశాడు. ఆమె ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మనోధైర్యాన్ని ఇచ్చాడు.

– ఆత్మకూరు

ఆసుపత్రికొచ్చి పింఛన్ ఇచ్చాడు



కరోనా సమయంలో మా వలంటీర్ మహేష్ అందించిన సేవలు మరిచిపోలేనివి. ప్రధానంగా నేను అస్వస్థతకు గురై కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చేరినప్పుడు నాకు మంజూరైన పింఛన్ తీసుకుని బైక్‌పై వచ్చి నగదు ఇచ్చాడు. ఆ సమయంలో ప్రజలు బయటికి రావాలన్నా భయపడేవారు. కానీ మా వలంటీర్ ధైర్యం చేసి ఆసుపత్రిలోకి వచ్చాడు. అతని ఇచ్చిన పింఛన్ సొమ్ము ఎంతో ఉపయోగపడింది. – సాలమ్మ, కురుకుంద, ఆత్మకూరు

నూతన బ్రిడ్జి నిర్మాణానికి మార్కింగ్



మార్కింగ్ పనులను పర్యవేక్షిస్తున్న నీటిపారుదల శాఖ డీఈ రఘురామిరెడ్డి

పగిడ్యాల: బీరవోలు– పగిడ్యాల గ్రామాల మధ్య కేసీ కాలువపై నూతన బ్రిడ్జీల నిర్మాణానికి నీటి పారుదల శాఖ డీఈ రఘురామిరెడ్డి, ఏఈ నరేష్ ఆదివారం మార్కింగ్ ఇచ్చారు. కేసీ కాలువపై పాత ముచ్చుమర్రి, పగిడ్యాల గ్రామాల వద్ద దెబ్బతిన్న బ్రిడ్జీల స్థానంలో కొత్తగా డబల్ లైన్ వంతెనలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన సంగతి పాఠకులకు విధితమే. పనులు దక్కించుకున్నా కాంట్రాక్టర్ అధికారుల చేత మార్కింగ్ ఇప్పించుకుని పనులు ప్రారంభించడం పట్ల రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పగిడ్యాల బ్రిడ్జికి రూ. 1.6 కోట్లు, పాత ముచ్చుమర్రి బ్రిడ్జికి రూ. 1.2 కోట్లు నిధులు కేటాయించినట్లు పర్యవేక్షక ఏఈ నరేష్ వెల్లడి చేశారు. డీఈ వెంట వర్క్ఇన్‌స్పెక్టర్ బాషా సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

పగిడ్యాల: స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నందున వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాలో స్వల్ప మార్పులు చేసినట్లు విద్యుత్ ఏఈ క్రాంతికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజాము 5 గంటల నుంచి బావులు, బోర్లు కలిగిన రైతులకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

చోరీ జరిగిన ప్రదేశాల్లో వేలిముద్రల సేకరణ

జూపాడుబంగ్లా: ఈనెల 14వ తేదీ తెల్లవారుజామున తంగడంచ గ్రామానికి చెందిన పెద్దగోవర్ధనయ్య ఇంట్లో, తంగడంచ చెక్‌పోస్టు వద్ద ఉన్న ధాబా, వీటన్నింటికంటే ఓ రోజు ముందు జూపాడు వద్దనున్న ఆలయాల్లో దొంగలు పడి వారికి దొరికినకాడికి దోచుకెళ్లిన సంగతి విధితమే. ఈ ప్రాంతాల్లో ఆదివారం నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో క్లూస్‌టీం ఎస్‌ఐ భరత్, సిబ్బంది వేలిముద్రలను సేకరించారు. అవి గతంలో దొంగతనాలకు పాల్పడిన దొంగల వేలిముద్రలతో ఏమైనా మ్యాచ్ అవుతాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించనున్నట్లు సమాచారం. అయితే దొంగతనం జరిగిన వెంటనే క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపడ్తే దొంగతనాలకు పాల్పడిన వారిపై పోలీసులకు కొంతమేర స్పష్టత వచ్చేది, దొంగతనం జరిగిన మూడు రోజుల తర్వాత వేలిముద్రలు సేకరించటం గమనార్హం.

23న వాల్మీకుల ర్యాలీ

మహానంది: వాల్మీకుల హక్కుల కోసం పోరాటాలు చేస్తామని, ఈ నెల 23న నంద్యాలలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న తెలిపారు. బండిఆత్మకూరులో ఆదివారం నియోజకవర్గ స్థాయిలో నూతన కమిటీని నియమించారు. శ్రీశైలం నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పరమటూరు శేఖర్, బండిఆత్మకూరు మండల ఎంఆర్‌పీఎస్ యూత్ అధ్యక్షుడిగా కరిమద్దెల ప్రసాద్‌లను నియమించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మధుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సచివాలయాలలో 'స్పందన' తప్పనిసరి

పగిడ్యాల/నందికొట్కూరు రూరల్ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామ సచివాయాలల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని పగిడ్యాల, నందికొట్కూరు ఎంపీడీఓలు వెంకటరమణ, శోభారాణి ఆదేశించారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో స్పందన కార్యక్రమం ఉన్నప్పటికి సచివాయాల వద్ద కూడా నిర్వహించాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. గైర్హాజరయ్యే సిబ్బందిపై చర్యలు తీసుకుని కలెక్టర్‌కు నివేదిక పంపుతామని హెచ్చరించారు.

పేదకుటుంబానికి ఆర్థిక చేయూత

కొత్తపల్లి: మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామానికి చెందిన కదిరి ఆశీర్వదమ్మ కుమార్తె కదిరి శ్యామల వివాహనికి కస్టమ్స్ ఆధికారి వేల్పుల ఆనంద్ కుమార్ ఆర్థిక చేయుత అందించారని సరస్వతి విద్యామందిర్ హైస్కూల్ కరస్పాండెంట్ గనముల మల్లయ్య, ఫార్మసిస్టు నాగన్న, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ జిల్లా కార్యదర్శి బొల్లు ప్రసాద్ బాబు యాదవ్ అన్నారు. ఆదివారం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అచ్చిరెడ్డి, శేఖర్‌లతో కలిసి ఆశీర్వాదమ్మ కుటుంబానికి రూ.10,116 అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్ర గౌడ్ కదిరి, నాగన్న, గ్రామ వలంటీర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అటవీ కంచె అపహరణకు విఫల యత్నం



చుట్టగా చుట్టిన ఇనుప కంచెను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, రైతులు

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామ సమీపంలో నల్లమల అటవీ చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప కంచెను అపహరించేందుకు దొంగలు విఫల యత్నం చేసిన ఘటన ఈనెల 15న రాత్రి చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఆదివారం ఉదయం నుంచి డాగ్ స్క్వాడ్‌తో దొంగల ఆచూకి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫారెస్టు బీట్ ఆఫీసర్ సుజాత మాట్లాడుతూ సంవత్సరం క్రితం 35 మీటర్ల మేర ఇనుప కంచెను అటవీ పరిధి చుట్టూ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాత్రి గుర్తుతెలియన వ్యక్తులు బోల్టులు తీసి కంచెను తొలగించి చుట్టగా చుట్టారు. వాహనంలో తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పొలాల్లో కావలికి వచ్చిన రైతుల లైట్లు వేయడంతో కంచె కట్టను అక్కడే వదిలేసి పరారయ్యారన్నారు. ఈ విషయంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఆమె వెంట అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డాగ్‌స్క్వాడ్ టీం ఎఫ్ఎస్ఓ జయరాజు, ఎఫ్‌బీఓ ఎస్ఎస్ పురా తదితరులు ఉన్నారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలి

ఆత్మకూరు: రాయలసీమకు తలమానికమైన సిద్ధేశ్వరం అలుగు నిర్మాణాన్ని, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత ప్రజల కోసం వెంటనే అలుగు, ఎత్తిపోతల పథకాలను వెంటనే ప్రారంభించాలని చెప్పారు. జీఓ నెంబర్ 98 ప్రకారం ముంపు బాధిత కుటుంబసభ్యులకు ఇంటింటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నాయక్ కేసును త్వరగా పరిష్కరించాలి



ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బంజార సేవా సంఘం నాయకులు

ఆత్మకూరు: శ్రీశైలంలో సంతోష్ నాయక్ హత్య కేసును త్వరిత గతిన పరిష్కరించాలని ఆల్ ఇండియా బంజార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ కోరారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం డీఎస్పీ శ్రీనివాసును కలిసి సమస్యలు వివరించారు. హత్యకు గురైన సంతోష్‌నాయక్ కారణాలు ఇప్పటి వరకు తెలియడం లేదని, అతనిని కిరాతకంగా కొట్టి చంపి, ఉరి తీశారన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం చుట్టూ సీసీ కెమెరాలు లేకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాలనాయక్, విజయనాయక్, రామ్‌బాలాజీ నాయక్, బాలునాయక్, సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వీడాలి

నంద్యాల(సెంట్రల్): ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది ప్రాధాన్యమివ్వాలని జిల్లా పట్టు పరిశ్రమ శాఖాధికారి, శ్రీశైలం నియోజకవర్గ ప్రత్యేకాధికారి పరమేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయస్థాయిలో పరిష్కారమవ్వాల్సిన సమస్యలు సైతం నేరుగా కలెక్టర్ వరకు రావటం ఆక్షేపణీయమన్నారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్ పలు మార్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా.. కొంతమంది సిబ్బందిలో మార్పు రావటం లేదన్నారు. కలెక్టర్ స్పందనలో భాగంగా మండలాధికారులతో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయ పీఎస్, సంక్షేమ కార్యదర్శులు సైతం జూమ్ విధానంలో పాల్గొనాలని సూచించారు. ఏదైనా ఫిర్యాదుపై వాకబు చేసేందుకు కలెక్టరు నేరుగా సంబంధిత సచివాలయ సిబ్బందితో జూమ్ ద్వారా మాట్లాడతారని, ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం ముగిసే వరకు జూమ్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో నంద్యాల జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బత్తుల రవికుమార్ మాట్లాడుతూ నూతనంగా పదోన్నతి పొందిన హెచ్‌ఎంలు, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈఓలు సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, వీరరాఘవయ్య, శివకుమార్, శంకర్, సుధాకర్, క్విట్ ఇండియా జిల్లా కో ఆర్డినేటర్ విశ్వనాథ్, సన్మాన గ్రహీతలు ప్రతాపుడు, మౌలానీ, శశికళ,బాలు, అశోక్‌రెడ్డి, బాబు, ప్రతాప్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు తగ్గించాలి

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాల వలన దేశంలో కూరగాయల ధరలు ఆకాశానికి అంటాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో ఆదివారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పుడు నుంచి నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయలు, పెట్రోల్ డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. ధరలు తగ్గించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, మంజుల, రామ్‌నాయక్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జనాన్ని చూసి టీడీపీ నాయకులకు దిమ్మ తిరిగింది

- మంత్రి పర్యటనను విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు
- మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



నందికొట్కూరు: ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవం కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన జనాన్ని చూసి తెలుగు దేశం పార్టీ నాయకులకు దిమ్మ తిరిగిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజాకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు స్వచ్ఛందంగా తరలివచ్చి మరో సారి వైఎస్సార్‌సీపీ బలం నిరూపించడంతో తెలుగు దేశం పార్టీకి మింగుడు పడటం లేదన్నారు. ఏ వీధిలో చూసినా జనంతో నిండిపోవడంతో 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి చేపట్టిన పాదయాత్ర, బస్సు యాత్ర జనం లేక బోసిపోయిందని గుర్తు చేశారు. 2500 బైక్‌లతో ర్యాలీ నిర్వహించి సీఎం వైఎస్ జగనన్న, రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై అభిమానాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు చాటుకున్నారని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, మిడుతూరు మండల కన్వీనర్ లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్ కాలపరిమితి పెంచాలి

ఆత్మకూరు: రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్ కాలాన్ని పెంచాలని ఒప్పంద అధ్యాపకుల సంఘం రాష్ట్ర జాయింట్‌సెక్రటరీ అబ్దుల్‌జబ్బార్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది విద్యా సంవత్సరానికి సంబంధించి 11 నెలల కాలానికి మాత్రమే ఉత్తర్వులు జారీ చేశారని, ఒకేషనల్ కోర్సులు వేసవి కాలంలో కూడా ఉంటాయన్నారు. కావున ఒప్పంద అధ్యాపకులకు 12 నెలల పాటు కొనసాగించాలని కోరారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్...ఇద్దరికి గాయాలు

మహానంది: టిప్పర్, ఆటో ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన గోపవరం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. గోపవరం గ్రామానికి చెందిన రంగస్వామి, మరొకరు ఆటోలో వస్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తరలించారు. నంద్యాల తాలుకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

తిమ్మాపురం నుంచి బుక్కాపురం వెళ్లే మార్గంలో మలుపు వద్ద బైక్ ఆదివారం రాత్రి అదుపు తప్పి కిందపడిన సంఘటనలో తిమ్మాపురం గ్రామానికి చెందిన అమ్రేష్ గాయపడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఆటో– లారీ ఢీ ఘటనలో మరొకరు మృతి

- నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అమలాపురం – రాధాపురం అంచె మధ్యలో ఈ నెల 4వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. నాటి ఘటనలో తీవ్రంగా గాయపడిన సంజీవనగర్ తండాకు చెందిన వరలక్ష్మి (35) అనే మహిళ ఆదివారం ఉదయం మరణించింది. సంజీవనగర్ తాండాకు చెందిన ఆటో వేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న కర్నూలుకు చెందిన నాగన్న (36) అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన తండ్రి వీరయ్య(65) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో అదే రోజు మరణించాడు. తండాకు చెందిన డేరంగుల సుబ్బమ్మ(60) ఆ మరుసటి రోజు కోలుకోలేక మృతి చెందింది. ఇదిలా ఉండగా ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వరలక్ష్మి కర్నూలులో చికిత్స తీసుకొని ఇటీవల ఇంటికి తిరిగి వచ్చింది. పూర్తిగా కోలుకుంటున్న సమయంలో ఆమె మరణించడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ ప్రమాదంలో గాయ పడినవారిలో ఆటో డ్రయివర్ హనుమంతు మాత్రమే చికిత్స పొందుతు కోలుకుంటున్నాడు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆత్మకూరు: మండలంలోని బాపనంతపురం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది హాజరు కవాలని కోరారు.

వివాహవేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

నంద్యాల పట్టణంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మకూరు మాజీ సర్పంచ్ జిలానీ మనవరాలు దివంగత సర్పంచ్ మొమిన్ సాజిద్ కుమార్తె వివాహ వేడుకలకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం కన్వీనర్ శిల్పా భువనేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మొమిన్ మునీర్‌బాషా, పువ్వాడ భాస్కర్, గౌస్‌లాజం తదితరులు పాల్గొన్నారు.

రేపు 'జగనన్న సురక్ష'

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లోని గాజులపల్లె, సంతజూటూరు గ్రామాల్లో ఈ నెల 18న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు రెండు మండలాల కన్వీనర్లు కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెండు గ్రామాల్లో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారన్నారు.